వరాహ పురాణోక్త

శ్రీగీతా మాహాత్మ్యమ్

ఓం నమోభగవతే వాసుదేవాయ

ధరోవాచ :

భగవ న్పరమేశాన భక్తి రవ్యభిచారిణీ ।

ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥ 1

తా॥ ధరాదేవి: భగవంతుడా! పరమేశ్వరా! ప్రభూ! ప్రారబ్ధాన్ని అనుభవించే మనుష్యులకు అచలమైన భక్తి ఎలా లభించగలదు?

శ్రీవిష్ణుః ఉవాచ :

ప్రారబ్ధం భుజ్యమానో హి గీతాభ్యాసరత స్సదా ।

స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥ 2

తా॥ శ్రీవిష్ణువు: ప్రారబ్ధభోగియైన మనుష్యుడు నిరంతరం గీతను అభ్యసిస్తే ఇహలోకంలోనే ముక్తుడై సుఖాన్ని పొంది, కర్మలిప్తుడు కాకుండా ఉంటాడు.

మహాపాపాతిపాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।

క్వచి త్స్పర్శం న కుర్వంతి నలినీదల మంబువత్ ॥ 3

తా॥ గీతాధ్యానం చేస్తే పద్మపత్రానికి నీరు అంటజాలనట్లు మహాపాపాలు, అతిపాపాలు కూడా అంటజాలవు.

గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।

తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥ 4

సర్వే దేవా శ్చ ఋషయో యోగినః పన్నగా శ్చ యే ।

గోపాలగోపికా వాపి నారదోద్ధవపార్షదైః ॥ 5

తా॥ ఎక్కడ గీతాగ్రంథం ఉంటుందో, మరియు ఎక్కడ గీతాపాఠం జరుగుతుందో అక్కడ ప్రయాగాది సర్వతీర్థాలూ వెలయుచుండును; అచ్చట సమస్త దేవతలూ, ఋషులూ, యోగులూ, పన్నగులూ, నారదుడూ, ఉద్ధవుడూ, పార్షద సహితులైన గోపాలురూ, గోపికలూ ఉంటారు.

సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ।
యత్ర గీతావిచార శ్చ పఠనం పాఠనం శ్రుతమ్ ।
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి స దైవ హి ॥ 6

తా॥ గీతాపఠనం జరిగేచోట వీరి సహాయం శీఘ్రంగానే లభిస్తుంది. పృథ్వీ, గీతలు ఆలోచింపబడే తావున, గీతా పఠన–పాఠన–శ్రవణాలు జరిగేచోట నేను సర్వదా వాసమొనర్తునని నీవు నిశ్చితంగా గ్రహించు.

గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మేచోత్తమం గృహమ్ ।
గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీ న్లోకా న్పాలయా మ్యహమ్ ॥ 7

తా॥ గీతయే నాకు ఆశ్రయం, గీతయే నాకు ఉత్తమ గృహం. గీతాజ్ఞానాన్ని అనుసరించియే, నేను త్రిలోకాలనూ పాలిస్తున్నాను.

గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః ।
అర్థమాత్రాక్షరా నిత్యా సానిర్వాచ్యపదాత్మికా ॥ 8

తా॥ గీత నన్ను గురించి తెలిపే పరవిద్య, బ్రహ్మరూపం అయి ఉంది; ఈ గీతాజ్ఞానం అవాఙ్మానసగోచరం (అర్థ మాత్రం), వినాశరహితమూ, నిత్యమూ, అనిర్వాచ్య పదాత్మికమూ అనే విషయంలో సందేహం లేదు.

చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్ ।
వేదత్రయీ పరానందా తత్త్వార్థజ్ఞానసంయుతా ॥ 9

తా॥ వేదస్వరూపమూ, పరమానందప్రదమూ, తత్త్వ జ్ఞాన బోధకమూ అయిన గీతను శ్రీకృష్ణుడు స్వయంగా అర్జునునికి బోధించాడు.

యోఽష్టాదశ జపే న్నిత్యం నరో నిశ్చలమానసః ।
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరాం పదమ్ ॥ 10

తా॥ గీతను నిత్యం సంపూర్ణంగా నిశ్చలచిత్తంతో పఠించేవాడు, జ్ఞానసిద్ధుడు అవుతాడు; పిదప అతడు పరమపదాన్ని పొందుతాడు.

పాఠేఽ సమర్థః సంపూర్ణే తతోఽ ర్థం పాఠ మాచరేత్ ।
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః ॥ 11

తా॥ సంపూర్ణంగా పఠింపజాలక, సగం మాత్రమే చదివితే గోదాన ఫలం లభిస్తుంది, ఈ విషయంలో సందేహం లేదు.

త్రిభాగం పఠమాన స్తు గంగాస్నానఫలం లభేత్ ।
షడంశం జపమాన స్తు సోమయాగఫలం లభేత్ ॥ 12

తా॥ ఏకతృతీయాంశాన్ని (మూడవ భాగం) పఠించే వాడికి గంగాస్నాన ఫలం లభిస్తుంది; ఏకషష్ఠాంశాన్ని (ఆరవ భాగం) చదువు వాడికి సోమయాగ ఫలం లభిస్తుంది.

ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః ।
రుద్రలోక మవాప్నోతి గణో భూత్వా వసే చ్చిరమ్ ॥ 13

తా॥ ఒక అధ్యాయం అయినా నిత్యం భక్తితో పఠించేవాడు రుద్రలోకాన్ని పొందుతాడు; అక్కడ శివానుచరులైన గణాలలో చేరి చిరకాలం ఉంటాడు.

అధ్యాయం శ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః ।
స యాతి నరతాం యావ న్మన్వంతరం వసుంధరే ॥ 14

తా॥ వసుంధరా! ప్రతిదినం ఒక అధ్యాయం గాని, ఏక చతుర్థాంశాన్ని గాని పఠించేవాడికి మనుష్యత్వం మన్వంతరం వరకూ ఉంటుంది.

గీతాయాః శ్లోకదశకం సప్తపంచ చతుష్టయమ్ ।
ద్వౌత్రీ నేకం త దర్ధం వా శ్లోకానాం యః పఠే న్న రః ॥ 15

చంద్రోలోక మవాప్నోతి వర్షాణా మయుతం ధ్రువమ్ ।
గీతాపాఠసమాయుక్తో మృతోఽ మానుషతాం వ్రజేత్ ॥ 16

తా॥ పది, ఏడు, ఐదు, నాలుగు, రెండు, మూడు, ఒకటి లేక అర్ధశ్లోకాలను

పఠించే మనుష్యుడు చంద్రలోకంలో వెయ్యి ఏళ్ళు ఉంటాడు; ఇలా గీతాపాఠ నిరతుడైన వాడు మరణానంతరం దేవత్వం పొందుతాడు.

గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమామ్ ।
గీతే త్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ ॥ 17

తా॥ అతడు మళ్ళీ గీతాపాఠమొనర్చి, ఉత్తమమైన ముక్తిని పొందుతాడు. మరణసమయంలో గీతాశబ్దాన్ని ఉచ్చరిస్తే సద్గతి లభిస్తుంది.

గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే ॥ 18

తా॥ గీతార్థ శ్రవణానురక్తుడైనవాడు మహాపాపియే అయినా వైకుంఠాన్ని పొంది విష్ణునితో కూడి ఆనందిస్తాడు.

గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।
జీవన్ముక్తః స విజ్ఞేయో దేహాన్తే పరమం పదమ్ ॥ 19

తా॥ కర్మిష్ఠి అయ్యి గీతార్థాన్ని ధ్యానించే వాడిని జీవన్ముక్తుడని గ్రహించు; మరణానతరం అతడు పరమ పదాన్ని పొందుతాడు.

గీతా మాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।
నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరం పదమ్ ॥ 20

తా॥ గీతను ఆశ్రయించియే జనకాది రాజులు ఇహలోకంలో పాపముక్తులని ప్రసిద్ధిపొంది, పరమగతిని పొందారు.

గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్ ।
వృథా పాఠో భవే త్తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥ 21

తా॥ మాహాత్మ్యమును చదవకపోతే గీతాపాఠం వ్యర్థమై, శ్రమయే మిగులుతుందని చెప్పబడుతోంది.

ఏత న్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః ।
సత త్ఫల మవాప్నోతి దుర్లభాం గతి మాప్నుయాత్ ॥ 22

తా॥ మాహాత్మ్యంతో కూడా గీతను పారాయణ చేస్తే, చెప్పబడిన ఫలంతో పాటు మోక్షం కూడా లభిస్తుంది.

సూత ఉవాచ :

మహాత్మ్య మేత ద్గీతాయాః మయా ప్రోక్తం సనాతనమ్.
గీతాన్తే చ పఠే ద్య స్తు య దుక్తం తత్ఫలం లభేత్ 23

తా॥ సూతుడు: ప్రాచీనమైన ఈ గీతామాహాత్మ్యాన్ని చెప్పాను. గీతను పారాయణం చేసిన పిదప దీనిని చదివిన వారికి చెప్పిన ఫలం లభిస్తుంది.

ఇతి శ్రీవరాహ - పురాణే శ్రీగీతామాహాత్మ్యం సమాప్తమ్.

ఇది శ్రీవరాహపురాణాంతర్గతమగు గీతామాహాత్మ్యము.